## ముల్లు పోయి కత్తి వచ్చె ఢాం ఢాం ఢాం!! (చురకలు-69) - by SKU

Back Home

ఎన్నికల టైము లో, అంతకు ముందూ మన ముఖ్యమంత్రి శ్రీ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేసినప్పుడు చేసిన వరుస వాగ్దానాలలో ప్రధానమైనది నక్సలైట్ సమస్య కి పరిష్కారం శాంతియుత చర్చల ద్వారా కనుగొనటం. నాకు నచ్చిన ఆయన వాగ్దానాలలో ఇది కూడా ముఖ్యమైనది. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం వుండగా నక్సలైట్ సమస్య లావా లా కుతకుతలాడి ఆయన మీద హత్యాయత్నం తో భళ్ళున బద్దలైంది. ఆ ప్రత్యక్ష యుద్ధం ఎన్నో ప్రాణాలని బలిగింది. ఎన్ని ఎన్ కౌంటర్లు చేస్తే అంతలా నక్సలైట్ లని అణచేసినట్టు అని పోలీసులూ, ఎన్ని విధ్వంసాలు, హత్యలూ చేసే అంతలా అప్పటి ప్రభుత్వానికి తమ ఉనికి ని తెలిపినట్టు అని నక్సలైట్లూ ఇలా ఇద్దరూ మతి చెడిన వారికి మల్లే ఒకరి మీద ఒకరు యుద్ధం చేసారు. ఫలితం? పోయిన ప్రాణాలూ, కాలి మసైన బతుకులూ!

నక్సలైట్ లని సమర్ధించే వారు ఎంత మందో, వారి సానుభూతిపరులు ఎంత మందో, వారిని ద్వేషించేవారు ఎంత మందో అనేది ఎవ్వరికీ తెలీదు కానీ చంద్రబాబు గారు ప్రజలు నక్సలైట్లతో లేరు అనీ, కాంగ్రెస్ వారు నక్సలైట్ లతో సానుకూల చర్చలకి ప్రజల మద్దతు వుందని ప్రసంగాలు చేసారు. ఆ నైపథ్యం లో ఎన్నికలు జరిగాయి. కారణాలు ఏమైనప్పటికీ, కాంగ్రెస్ వారు ఏదో ఊడబొడుస్తారు అని ప్రజలు నమ్మారు, చంద్రబాబు తీరు పీరు వుండరు అని ఆశపడ్డారు. వారిని గద్దెనెక్కించారు.

వాగ్ధానం చేసిన ప్రకారం అధికారం లోకి రాగానే, రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం నక్సలైట్లని చర్చలకి పిలిచారు. ఏదో కొన్నాళ్ళు ఆ కార్యక్రమం వెలగబెట్టాక చర్చలు మళ్ళీ జరుగుతాయి అని ప్రభుత్వం, ఏమో చెప్పలేము.. నుంచి, ఇంక మళ్ళీ చర్చల ప్రశక్తి లేదు వరకూ రకరకాల ప్రకటనలు ఈ నక్సలైట్లూ చేసారు. అసలు సంగతి రక్తం మరిగిన పులుల మల్లే మారిన ఎవడైనా చేతులు ముడుచుకు కూర్చో అని ముక్కుతాడు వేస్తే వుండగలరా? కూంబింగ్ పేరు చెప్పి ధారుణాలు చేసే పోలీసులూ ఊరుకోరు.. తమ ఆధిపత్యం నుండి ప్రజలు ఎక్కడ జారిపోతారో అనే భయం పట్టుకున్న ఈ నక్సలైట్లూ ఊరుకోరు. లేకపోతే, నక్సలైట్ల ఆశయం ఏమిటి? దేనికోసం వాళ్ళ ఉద్యమం? ఏం సాధిద్దాం అని? అంత సదుద్దేశాలే వాళ్ళకి వుంటే తమకి అనుకూలమైన వాతావరణం వున్నప్పుడు తమ ప్రాబల్యం పెంచుకోవటానికి తాపత్రయపడుతున్నారు కానీ, తమ అసలు ఉద్దేశం ఏమిటీ అనేది ప్రభుత్వానికి చెప్పే యత్నం నిజాయితీగా చేసారా? వాళ్ళనొక్కళ్ళనీ అనటం లేదు లెండి.. పోలీసులు మాత్రం చేసినది ఏమిటీ? ఒకవైపు హోమ్ మినిస్టర్ ఎన్ కౌంటర్లు ఆపేయాలి అని ప్రకటనలు చేస్తూనే వున్నారు.. పోలీసులు తమ పని కానిస్తూనే వున్నారు. ప్రభుత్వం నక్సలైట్ల తో జరిపిన చర్చలు విఫలం కావటానికి కొంతమంది పోలీస్ ప్రముఖులే కారణం అని పుకార్లు వచ్చాయి అంటే నిప్పు లేనిదే పొగ వస్తుందటండీ?

సరే, ఇప్పుడు నక్సలైట్లు చర్చల హడావిడి ముగిసింది.. అక్కడ అక్కడా మళ్ళీ యుద్ధాలు మొదలయ్యాయి. కానీ కాంగ్రెస్ శాసనసభ్యుడు నర్శిరెడ్డి, ఆయన కుమారుడి హత్య తో ఉగ్రరూపం దాల్చి మళ్ళీ ప్రత్యక్ష యుద్ధం కి దారితీసే పరిణామాలు తయారయ్యాయి. క్రితం ప్రభుత్వం చేసిన పొరపాటు ఈ ప్రభుత్వం కూడా చేయటం మొదలెట్టింది. మళ్ళి వారి మీద నిషేధం విధించారు. అంతటితో ఆగక వారి సానుభూతి పరుల మీద, పత్రికల మీదా, వారి తో సంబంధం వున్న ప్రతీ సంస్థ మీదా నిషేధాజ్ఞలు విధించారు.. ఇంకా ఆ నిషేధించిన సంస్థల లిస్ట్ చదువుతూనే వున్నారు. ఇలా ఒక శాసన సభ్యుడి ప్రాణం పోయిందన్న ఆవేశం తో ముందు వెనుకలు ఆలోచించకుండా

నిర్ణయాలు తీసుకుంటే రేపు ఇంకా ఎటువంటి ధారుణాలు జరుగుతాయో అని ఏమన్నా ఆలోచన ఈ ప్రభుత్వానికి వుందా?

ఈ చర్యల వలన నక్సలైట్ సమస్య కి పరిష్కారం ఏమన్నా దొరుకుతుందా? పోనీ నక్సలైట్లని ఈ రకమైన చర్యల వలన ఏమన్నా కంట్రోల్ చేయగలరా? క్రితం ప్రభుత్వం ఏమన్నా ఈ రకం నిషేధాల వలన సాధించిందా పీళ్ళు కూడా అదే పంధా లో నడిచి ఏదో ఒరగబెట్టాలనుకోవటానికి? మరి సమస్య కి పరిష్కారం?

---

మీ సలహాలు, సూచనలు, అభి ప్రాయాలు రచయిత్రి SKU కి తెలియపరచండి.
మీ అభి ప్రాయాలు రచ్చబండ లో తెలియచేయండి